# హలో... హలో...

- జి. మేరీ కృపాబాయి



ఆరోజు అనుకోకుండా హాలిడే రావడంతో ఇంట్లోనే ఉన్నాడు కిషోర్. చాలా రోజుల తర్వాత వచ్చిన హాలిడే కావడం వల్ల బయటికెక్కడికీ వెళ్లకుండా ఇంట్లోనే గడపాలని నిర్ణయించుకున్నాడు. భార్య లక్ష్మికూడా పనంతా ముగించుకొని స్నానానికి వెళ్లింది. ఇంతలో ఫోను రింగయిన శబ్దానికి ఫోను దగ్గరికి వెళ్లాడు కిషోర్.

"హలో......."

అవతలి వైపు నుండి ఫోను కట్ చేసిన శబ్దం

"ఎవరబ్బా ఫోన్ కట్ చేసారు? ఆఫీసు నుండి కాదు కదా." ఆలోచిస్తూ కూర్చున్నాడు కిషోర్

"ఫోను ఎవరండీ" బాత్ రూమ్ లోంచి బయటకు వస్తూ అడిగింది లక్ష్మి.

"ఎవరో కట్ చేసేసారు. ఆఫీసు నుండి పిలుపు ఏమైనా వస్తుందేమోనని నా భయం" అన్నాడు కిషోర్.

ఇంతలో మళ్ళీ ఫోను రింగయిన శబ్దం. ఈసారి లక్ష్మి రిసీవ్ చేసుకుంది.

"హలో.......లక్ష్మినే....మీరెవరు.....రాంగ్ నెంబర్" అంటూ పెట్టేసింది లక్ష్మి.

"ఎవరు కావాలట?" ప్రశ్నించాడు కిషోర్.

"లక్ష్మి అనే అంటున్నారు. మనకు తెలిసిన వాళ్లెవరూ కాదు అందుకే రాంగ్ నెంబర్ అని పెట్టేసాను" అంది లక్ష్మి.

ఇంతలో మళ్లీ ఫోను మ్రోగిన శబ్దం. ఈసారి నేను తీస్తానుండు అంటూ కిషోర్ వెళ్లి రిసీవర్ ఎత్తాడు. హలో అనకుండానే అటువైపు నుండి మగగొంతులో మాటలు విన్పిస్తున్నాయి.

"లక్ష్మి నేను, ఈరోజు రావట్లేదు. కారణం ఈ సారి కలిసినపుడు చెబుతాలే" అంటూ ఫోన్ పెట్టేసారు.

"ఎవరండీ మళ్లా చేసారు?" అని అడిగింది లక్ష్మి.

"ఎవరో తెలీట్లేదు. ఫోను డిస్టబెన్స్‌గా ఉంది. క్లియర్‌గా లేదు కట్ చేసేసారు" అబద్ధం చెప్పాడు కిషోర్.

అబద్ధం చెప్పాడే గాని అతని మనసుని ఏదో అనుమానం కలచి వేస్తోంది. "ఫోన్ చేసింది ఎవరై ఉంటారు? అనుమానం లేదు. ఖచ్చితంగా లక్ష్మికే ఫోను. ఫోనులో వినబడిన మాటలను బట్టి లక్ష్మికి మరెవరితోనైనా సంబంధం ఉందా? ఇది తను ఆఫీసులో ఉండే టైము కూడాను. ఈ రోజు అనుకోకుండా ఇంట్లో ఉండబట్టి సరిపోయింది".

రకరకాల అనుమానాలతో కిషోర్ మనసు బరువెక్కిపోయింది.

"ఏమిటండీ ఆలోచిస్తున్నారు" అంది లక్ష్మి చెల్లాచెదురుగా ఉన్న న్యూస్ పేపర్స్ సరిచేస్తూ.

"ఆ ఏం లేదు ఆఫీసు పెండింగ్ ఫైల్స్ గురించి ఆలోచిస్తున్నాను". అన్నాడు కిషోర్ కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ.

''సెలవురోజు కూడా మీకు ఆఫీసు ధ్యాసేనా?" నవ్వుతూ అంది లక్ష్మి.

నెలరోజులు గడిచాయి. ఆరోజు లక్ష్మికి ఫోను వచ్చిందగ్గర నుండీ కిషోర్ మనసు మనసులో లేదు. రకరకాల ఆలోచనలతో పరిపరివిధాలు పోతున్న మనసు అంతా అస్తవ్యస్తంగా అన్పిస్తోంది కిషోర్‌కి. దేనిమీదా ఏకాగ్రత లేదు. దాదాపు నెల రోజుల్నించీ లక్ష్మితో ఫ్రీగా ఉండలేకపోతు న్నాడు.

"తనకు తెలిసినంతవరకూ లక్ష్మి మంచిదే. ఆమె మనస్తత్వం కూడా స్వచ్ఛమైనదే. తనంటే ప్రాణం కూడాను. ప్రతిక్షణం తన సమక్షంలోనే ఉండాలనే మనస్తత్వం ఆమెది అయినా కూడా.... ఏమిటిలా .... ఆ ఫోన్ కాల్ గురించే తనకు అర్థంకావడం లేదు.... ఆలోచనల పరంపరలతో కిషోర్ తల్లడిల్లిపోతున్నాడు.

నెలరోజులు కాస్తా ఐదునెలలైనాయి. ఫోన్‌కాల్ కారణంగానే లక్ష్మిని తప్పించుకొని తిరుగుతున్నాడు కిషోర్. చాలాసార్లు లక్ష్మి ఎందుకలా ఉంటున్నారు? వంట్లో బాగాలేదా అంటూనే ఉంది. అయినప్పటికీ కిషోర్ మామూలు మనిషి కాలేకపోతున్నాడు. లక్ష్మి పేరంటానికంటూ పక్కింటికి వెళ్లింది. లక్ష్మిఇంట్లో లేకపోతే కిషోర్ ఆలోచనలు మరీవిపరీతంగా ఉంటున్నాయి. ఐదునెలల క్రితం వచ్చిన ఫోన్ కాల్ గురించే ఆలోచిస్తున్నాడు కిషోర్.

ఇంతలో ఫోన్ మ్రోగిన శబ్దం

"హలో........"రిసీవర్ ఎత్తాడు కిషోర్.

"కిషోర్ ఉన్నాడా.." అటువైపునుండి స్త్రీ గొంతు.

"ఎవరు మీరు? కిషోర్‌నే మాట్లాడుతున్నాను" అన్నాడు కిషోర్.

" హాయ్ కిషోర్! నువ్వేనా? వెయ్యి స్వరాల మధ్య ఉన్నా నీ స్వరం గుర్తు పట్టగలను కదా!ఈరోజు గుర్తు పట్టలేకపోయానేమిటి? నీకో గుడ్‌న్యూస్ మనప్రేమ విషయం మా ఇంట్లోచెప్పేసాను. సాయంకాలం పార్కుకి రా అన్ని విషయాలు చెప్తాను.. ....." చెప్పుకుంటూ పోతుంది అవతలి కంఠం.

"ఏయ్ ఎవరండీ మాట్లాడేది? రాంగ్ నెంబరనుకుంటా " అంటూ అరిచాడు కిషోర్ .

"అమ్మదొంగా అలా అంటే ఫోను పెట్టేస్తాననుకున్నావా? ఫోను పెట్టనుగాక పెట్టను. అన్ని విషయాలు ఇప్పుడే చెప్పేస్తాను. సాయంకాలం వరకూ ఆగలేను.......అంటూ చెప్పుకు పోతోంది అవతలి కంఠం. ఠక్కున ఫోన్ పెట్టేసాడు కిషోర్

"ఎవరో రాంగ్ నెంబరనుకుంటా నా ప్రాణం తీసేసింది. నా మాట కూడా వినకుండా చెప్పుకుపోతోంది. ఇటువంటి ఫోన్ లక్ష్మి రిసీవ్ చేసుకుంటే కొంప మునిగేది. ఐదు నెలల క్రితం లక్ష్మికి వచ్చిన ఫోన్ కాల్ ఇటువంటిదే అయి ఉంటుంది. అనవసరంగా తను లక్ష్మిని అపార్థం చేసుకున్నాడు. నేటితో తన మనసులోని అనుమా నాలన్నీ పటా పంచలై పోయాయి. అనవసరంగా లక్ష్మిని బాధ పెట్టాను.'' అనుకుంటుండగానే లక్ష్మి పేరంటంనుంచి వచ్చింది.

''ఏమిటి లక్ష్మి పేరంటానికెళ్లి ఇంతసేపు న్నావ్. నువ్వు లేకుండా ఇంతసేపు ఎలా ఉంటాననుకున్నావ్?'' అంటున్న కిషోర్ వైపు ఆశ్చర్యంగా చూసింది లక్ష్మి. ★

### జ్ఞానపీఠ్ బహుమతి

ప్రతి సంవత్సరం డిశంబర్10న జ్ఞానపీఠ్ బహుమతి ప్రధానోత్సవం నిర్వహిస్తారు. పారిశ్రామిక వేత్త సాహు శాంతి ప్రసాద్ జైన్, ఆయన భార్య రోమాజైన్ భారతీయ జ్ఞానపీఠ్ ఫౌండేషన్‌ను 1964లో స్థాపించారు. 1965నుంచి ఈ అవార్డును ఇస్తున్నారు. ఈఅవార్డు పొందిన వారికి 5లక్షలరూపాయలు నగదు, సరస్వతీ దేవి విగ్రహం ప్రధానం చేస్తారు. మళయాళ రచయిత అయిన శంకర కురుప్ మొదటిసారి అవార్డు పొందారు.